## ఆధిపత్య పోరులో మామను హతమార్చిన అల్లుడు

- సహకరించిన కుమార్తె
- మిర్యాల మాజీ సర్పంచ్ హత్య కేసులో 13 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మార్చి 24: నూతనకల్ మండలం మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్యగౌడ్ హత్య కేసులో 13 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ నెల 17న సాయంత్రం చక్రయ్యపై గ్రామంలోనే కొందరు దుండగులు కర్రలు, మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం వెతకసాగారు. 24న తుంగతుర్తిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా చక్రయ్య హత్య కేసులో పాల్గొన్న వ్యక్తిని గుర్తించారు. అతడి ద్వారా హత్యకు కుట్ర పన్నిన చక్రయ్య అల్లుడు కనకటి వెంకన్న, సహకరించిన చక్రయ్య కుమార్తె సునీతతో పాటు మొత్తం 13 మందిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్యకు పాల్పడినట్లు అంగీకరించారు. గత 40 ఏండ్లుగా గ్రామపెద్దగా చలామణి అవుతూ గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన చక్రయ్య తన మూడో కుమార్తె అయిన సునీతను సర్పంచ్, అల్లుడు కనకటి వెంకన్నను పీఏసీఎస్ చైర్మన్‌గా కూడా చేశాడు. వారంతా ఒకే కుటుంబంగా ఉంటున్నారు. వెంకన్న పీఏసీఎస్ చైర్మన్ అయిన ప్పటి నుంచి నూతనకల్ మండలంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. అయితే, గ్రామంలో చక్రయ్య ఆధిపత్యం కొనసాగుతుండడంతో వెంకన్న వర్గీయులు సహించలేక వ్యతిరేకంగా ఒక గ్రూపుగా ఏర్పడడంతో మనస్పర్థలు కొనసాగుతున్నాయి. 2023లో చక్రయ్య బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా, 2024లో వెంకన్న కాంగ్రెస్‌లోకి వచ్చాడు. అయినప్పటికీ చక్రయ్య ఆధిపత్యం కొనసాగుతుండడంతో అడ్డు తొలగించుకునేందుకు నిర్ణయించుకోగా బొడ్రాయి ఉత్సవాలు ఆజ్యం పోశాయి. గతంలో కనకటి వెంకన్న ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగగా, చక్రయ్య ఈసారి బొడ్రాయి ఉత్సవాలను తన ఆధ్వర్యంలో నిర్వహించడంతో తట్టుకోలేక హత్యకు పూనుకున్నారు. ఈ మేరకు పథకం పన్ని వెంకన్న తన అనుచరులైన కనకటి శ్రవణ్, కనకటి లింగయ్య, కనకటి ఉప్పలయ్య, కనకటి శ్రీకాంత్, గంధసిరి వెంకటేశ్, పెద్దింటి మధు, పెద్దింటి గణేశ్‌తో కలిసి చక్రయ్యను హత్య చేయించాడు. ఈ కేసులో కనకటి వెంకన్న, సునీతతో పాటు మొత్తం 13 మందిని అరెస్ట్ చేసి రెండు కార్లు, ఒక కర్ర, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

## ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి : ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మార్చి 24: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ కె.నరసింహ మాట్లాడి వారి అర్జీలను పరిశీలించారు. ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**సీజ్ చేసిన వాహనాలను విడిపించుకోవాలి**

వివిధ నేరాల్లో, వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు సంబంధించిన యజమానులు సరైన పత్రాలను చూపి వాటిని తీసుకెళ్లాలని ఎస్పీ కె.నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో 120 ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు తెలిపారు. ఆరు నెలల గడువులోగా జిల్లా పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో సరైన పత్రాలు సమర్పించి విడిపించుకోవాలన్నారు. లేనిపక్షంలో కాలం చెల్లిన వాహనాలను పాత ఇనుముకు, సామర్థ్యం ఉన్న వాటిని వేలం వేయనున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను జిల్లా పోలీస్ విభాగానికి ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాల్లో పొందుపరుస్తామని వెల్లడించారు.

## అతి వేగంతో వాహన ప్రమాదాలు : ఆర్టీఓ సురేశ్‌రెడ్డి

నేరేడుచర్లలోని చౌరస్తా వద్ద ప్రమాదాలు జరుగుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ సురేశ్‌రెడ్డి

నేరేడుచర్ల, మార్చి 24: వాహనాల అతి వేగంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నిదానమే ప్రధానమని సూర్యాపేట ఆర్టీఓ సురేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని మిర్యాలగూడ – కోదాడ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్‌తో కలిసి సోమవారం గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిత్యం ప్రమాదాలు జరిగే మూడు స్థలాల(బ్లాక్‌స్పాట్)ను గుర్తించామని చెప్పారు. చిల్లేపల్లి చెరువు సమీపంలోని అవని రైస్ ఇండస్ట్రీ మలుపు వద్ద, మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో, పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద ప్రమాదం జరిగే స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వాహనదారులను హెచ్చరించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ ఏఈ నవీన్‌కుమార్, రహదారి కాంట్రాక్టర్ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలంలోని అప్పన్నపేట స్టేజీ, అబ్బిరెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు వద్ద నేషనల్ హైవే 167పై తరుచూ ప్రమాదాలు జరిగే స్థలాలను ఆర్టీఓ సురేశ్‌రెడ్డి, ఏఈ నవీన్‌తో కలిసి ఎస్ఐ నరేశ్ సోమవారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

## స్కూల్‌లో వ్యర్థాలు వేయొద్దని విద్యార్థుల ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గరిడేపల్లి, మార్చి 24: మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలు చెత్తను, ఇతర వ్యర్థాలను స్కూల్ ఆవరణలో, గోడ పక్కన వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, వ్యర్థాలను దూరంగా పడేయాలని అవగాహన కల్పిస్తూ పాఠశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జంపాల ప్రసన్నకుమారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చిన్న బాలయ్య, మల్లికార్జునరెడ్డి, రమేశ్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

**లింక్ డాక్యుమెంట్ పోయినవి**

రావుల అంజమ్మ, W/o. లింగయ్య, R/o.ఊట్కూరు, మం॥శాలిగౌరారం, నల్లగొండ జిల్లా అను పేరుగల ప్లాటు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.3282/2013 సూర్యాపేట పాత బస్టాండ్ నుండి బాలెంలకు వెళ్తుండగా మార్గమధ్యలో పోయినది. దొరికినవారు సంప్రదించగలరు.
సెల్: 7989983583

**NAME CHANGE**

I, DEVARAPALLY ANITHA, W/o. DEVARAPALLY MOHAN REDDY (OLD NAME) R/o. H.No.1-30 SURARAM VILLAGE, RAMANNAPET MANDAL YADADRI BHONGIRI DISTRICT, TELANGANA STATE, 508113 I HAVE CHANGED MY NAME AS **BHIMIDI ANITHA**, W/o. DEVARAPALLY MOHAN REDDY (NEW NAME).

**లింక్ డాక్యుమెంట్ పోయినవి**

ఆవుదొడ్డి గంగమ్మ, D/o. లింగయ్య లేటు, R/o.ఆరెగూడెం, సూర్యాపేట మం॥, సూర్యాపేట జిల్లా అను పేరుగల ప్లాటు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.3282/2013 సూర్యాపేట పాత బస్టాండ్ నుండి బాలెంలకు వెళ్తుండగా మార్గమార్యలో పోయినది. దొరికినవారు సంప్రదించగలరు
సెల్: 7989983583

**పేరు మార్పు**

బుగ్గ లింగస్వామి, S/o. నరసింహ నా కుమార్తె అయిన బుగ్గపూర్ణి 13 సంవత్సరాలు అర్హత 8వ తరగతి విద్యార్థి R/o. H.No.17-63, గ్రా॥నారాయణగిరి, మం॥భూదాన్‌పోచంపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా, నేను నా కుమార్తె పేరుని బుగ్గ లాస్యప్రియగా మార్పు చేయడమైనదని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
మహబూబ్‌నగర్ : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | తొలకట్టి : 9182777638


# మట్టపల్లి ఆలయంలో సమస్యల తిష్ట

- నిరాదరణకు గురవుతున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం
- సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని భక్తుల వేడుకోలు

మహిళా భక్తులు దుస్తులు మార్చుకునే షెడ్డు పరిస్థితి ఇదీ..

ఆలయం బయట ఉన్న నల్లాలు

మఠంపల్లి, మార్చి 24: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వెయ్యేండ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయానికి గవర్నర్ మొదలు జడ్జిలు, మంత్రులు, కలెక్టర్లతో పాటు ఎందరో వీఐపీలు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అటువంటి చరిత్ర కలిగిన ఆలయం నేడు సమస్యల వలయంలో చిక్కుకుంది. ఎన్నో పాలక వర్గాలు మారినా నిరాదరణకే గురవుతున్నది. భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకవర్గం, అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు వెచ్చించి కొన్ని అభివృద్ధి పనులు చేపట్టగా ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో నిరాదరణకు గురవుతుందనే చెప్పొచ్చు. ప్రధానంగా మహిళలు స్నానాలు చేసేందుకు, దుస్తులు మార్చుకునేందుకు గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండడం, వసతులు లేకపోవడంపై ఇటీవల ఓ భక్తుడు అసహనంతో ఫొటోలు తీసి మీడియాకు పంపించాడంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మట్టపల్లిలో కొన్ని కులాల ప్రాతిపదికన సత్రాలు ఉండగా ఇతరులు వస్తే ఇక్కట్లు తప్పడం లేదు. పులిచింతల ప్రాజెక్ట్ రాక ముందు కృష్ణానదిలో భక్తులు స్నానమాచరించేవారు. తదనంతరం బ్యాక్ వాటర్ కారణంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయడంతో కృష్ణా నదిలోకి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఇక్కడికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కాగా, ఉగాది పండుగ రోజున సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి మట్టపల్లిలోనే శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో ఆలయం వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని భక్తులు వేడుకుంటున్నారు.

**భక్తులకు తీవ్ర ఇబ్బందులు**

ఆలయంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీలు దుస్తులు మార్చుకోవడానికి, పుణ్యస్నానాలు ఆచరించడానికి కనీస సౌకర్యాలు లేవు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రాబోయే స్వామివారి కల్యాణం నాటికైనా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి మౌలిక సదుపాయాల కల్పించాలి.

–కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, భక్తుడు

# సూర్యాపేటను క్షయ రహిత జిల్లాగా మారుద్దాం

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మార్చి 24: సూర్యాపేటను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. వైద్యశాఖతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాటాడారు. నిక్షయ్ శిబిర్‌లో భాగంగా డిసెంబర్ 7 నుంచి మార్చి 17 వరకు చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో 1,13,961 మందికి క్షయ వ్యాధి స్క్రీనింగ్ చేయడం జరిగిందని, 17,838 మంది అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహించగా 491 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు తెలిసిందని చెప్పారు. క్షయ బాధితులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఆరు నెలలకు రూ.6 వేలు అందించడం జరుగుతుందని తెలిపారు. కాగా, సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 58 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ అప్పారావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, డీఈఓ అశోక్, సీపీఓ కిషన్, సంక్షేమ అధికారులు లత, శంకర్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మండలానికి ఒక మోడల్ అంగన్‌వాడీ కేంద్రం**

ప్రతి మండలానికి ఒక మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అదేవిధంగా జిల్లాలో పర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ట్రాన్స్‌జెండర్ల జీవన విధానం మెరుగుపరిచేందుకు వారితో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమాధికారి నరసింహారావు, సీపీడీఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

నేరేడుచర్ల, మార్చి 24: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో శాసనసభ స్పీకర్ సరైన నిర్ణయం తీసుకొని వారిపై వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నర్సింహారావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్పీకర్ రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు. ఈ నెల 22వ తేదీలోపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించినప్పటికీ స్పీకర్ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి లంకెపల్లి నాగార్జున, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు లావుడ్య శ్రీనునాయక్, బచ్చలకూరి నాగేశ్వర్, ఇంజమూరి రాములు, కొత్త నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రవినాయక్

పాలకవీడు, మార్చి 24: అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రవినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రచారం చేస్తుంది కానీ కొత్త రేషన్ కార్డులు మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు వెంకటరెడ్డి, గోపాల్, పసుపులేటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యానికి సన్మానం

సూర్యాపేట టౌన్, మార్చి 24: జిల్లా కేంద్రంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీపీఐ పట్టణ, మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉస్తెల సుజన, సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, నాయకులు కేవీఎల్, మల్లీశ్వరి, యల్లవుల రాములు, డి. ధనుంజయనాయుడు, ఉస్తెల నారాయణరెడ్డి, ఎల్లంల యాదగిరి, ఎం.వెంకటేశ్వర్లు, కె.శ్రీను, వెంకటేశ్వర్లు, బి.కృష్ణారెడ్డి, బి.హనుమంతరావు, బి.శ్రీనివాస్, చామల అశోక్‌కుమార్, నిమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు వృథా కావు

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణ

నేరేడుచర్ల, మార్చి 24: దేశం కోసం మరణించిన అమరుల త్యాగాలు వృథా కావని, వారి జీవితాలు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు చండ్ర అరుణ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీవైఎల్ జిల్లా నాయకుడు వాసా కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు హన్మేశ్, ఆవుల అశోక్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, నాయకులు కారింగుల వెంకన్న, వాసా పల్లయ్య, పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, హుస్సేన్, లక్ష్మయ్య, భిక్షం, లక్ష్మి, పావని, రేష్మ, మాలంబి, సత్తమ్మ, మరియమ్మ, విజయ్, రజాక్, సైదులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సరోజ

గరిడేపల్లి, మార్చి 24: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ ఆర్.సరోజ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ త్రిపురం అంజన్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండా నర్సిరెడ్డి, కల్మల్‌చెర్వు మాజీ సర్పంచ్ సీతారాంరెడ్డి, బొంత వెంకటరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, రావుల వెంకన్న, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ద్వారా ఇంటికే రాములోరి కల్యాణ తలంబ్రాలు

సూర్యాపేట అర్బన్, మార్చి 24: భద్రాచలంలో జరిగే సీతారామచంద్రుల వారి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ ద్వారా ఇంటికే పొందవచ్చని ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ కె.జాన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం సీతారాముల కల్యాణ తలంబ్రాల పోస్టర్‌ను సూర్యాపేట డిపోలో అధికారులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం కార్గో ద్వారా రూ.151 చెల్లించిన భక్తులు ఇంటి వద్దే ముత్యాల తలంబ్రాలు పొందవచ్చని తెలిపారు. తలంబ్రాల కోసం డిపో కార్గో ఆఫీస్‌లో కానీ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ను 91542 98695 నంబర్‌లో కానీ సంప్రదించి బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం సుచరిత, డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జానీ పాషా పాల్గొన్నారు.

## సూర్యాపేట మార్కెట్‌కు 22,475 బస్తాల ధాన్యం రాక

సూర్యాపేట టౌన్, మార్చి 24: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు యాసంగి సీజన్‌కు సంబంధించిన దిగుబడులను రైతులు సోమవారం పెద్ద ఎత్తున తీసుకొచ్చారు. 22,475 బస్తాల ధాన్యం రాగా అందులో 21,680 బస్తాల వరి ధాన్యం వచ్చింది. మార్కెట్ సెక్రటరీ సంతోశ్‌కుమార్ ధాన్యాన్ని పరిశీలించి వెంట వెంటనే కాంటాలు వేసి రైతులకు తగిన ధర వచ్చేలా వ్యాపారులతో మాట్లాడారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దిరాల, మార్చి 24: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వీరన్న తెలిపారు. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన కొరిపెల్లి సందీప్‌రెడ్డి, రేసు జగదీశ్ అనే వ్యక్తులు పాలేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తమ ట్రాక్టర్లతో రవాణా చేస్తుండగా మండల కేంద్రంలో ఒకటి, ముకుందాపురం శివారులో మరొకటి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## బాల నాగమ్మ నాటకం పోస్టర్లు ఆవిష్కరణ

మఠంపల్లి, మార్చి 24: ఉగాది సందర్భంగా స్థానిక శ్రీ ఆగ్నేష్ అమ్మ బాల శౌరయ్య నాట్య కళా మండలి, జ్యోతి ప్రకాశ్ యోజన నాట్య కళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న మఠంపల్లిలోని బొడ్రాయి సెంటర్ వద్ద ప్రదర్శించనున్న బాల నాగమ్మ నాటకం పోస్టర్లను కళాకారులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భువనగిరి ప్రకాశ్‌బాబు, కళాకారులు థామస్‌రెడ్డి, రామారావు, వెంకటేశ్వర్లు, కిరణ్, గోపయ్య పాల్గొన్నారు.

## భారతదేశం విభిన్న సంస్కృతులకు నిలయం : ఎంఈఓ

నృత్యం చేస్తున్న విద్యార్థులు

మునగాల, మార్చి 24: భారతదేశం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహించిన శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు దేశ సమైఖ్యత, సమగ్రతను కాపాడుతూ ఆచార, సంప్రదాయాలను పరస్పరం గౌరవించుకోవాలని అన్నారు. కాగా, ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బూర సైదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నూతన సాంకేతికత వినియోగంపై రైతులను ప్రోత్సహించాలి'

గరిడేపల్లి, మార్చి 24: వ్యవసాయంలో నూతన సాంకేతికత వినియోగంపై రైతులను శాస్త్రవేత్తలు ప్రోత్సహించాలని కేవీకే కంపసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గడ్డిపల్లి కేవీకేలో ఏర్పాటు చేసిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా చూడాలన్నారు. ఆరుతడి పంటలు, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, ఇన్‌చార్జి హెడ్ డి.నరేశ్, శాస్త్రవేత్తలు సీహెచ్.నరేశ్, ఎ.కిరణ్, ఆదర్శ్, టి.మాధురి, ఎన్.సుగంధి, జిల్లా ఉద్యాన అధికారి ఎం.వినయ్‌కుమార్, యాదాద్రి భువనగిరి డాట్ సెంటర్ కోఆర్డినేటర్ బి.అనిల్‌కుమార్, నాబార్డు డీడీఎం ఎన్.సత్యనారాయణ, ఆర్.రేవతి , హుజూర్‌నగర్ ఏడీఏ ప్రీతంకుమార్, మండల వ్యవసాయాధికారి ఎం.మహేశ్ పాల్గొన్నారు.

## 'క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి'

అర్వపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

అర్వపల్లి, మార్చి 24: క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి భూక్యా నగేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలనపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నగేశ్ మాట్లాడుతూ క్షయ వ్యాధి తుంపర్లు, గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని, సకాలంలో మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి బిచ్చ